క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కాట్రగడ్డ



కాట్రగడ్డ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన కాట్రగడ్డ శ్రీనివాసరావును ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి కాట్రగడ్డ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షునిగా అన్వేష్

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం సంతనూతలపాడు నియోజకవర్గ అధ్యక్షునిగా పల్లెపాటి అన్వేష్‌ను నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ కేంద్ర కమిటీ కార్యాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

డాక్టర్ వెంకటేశ్వరరావుకు అభినందనలు



డాక్టర్ వెంకటేశ్వరావును అభినందిస్తున్న సభ్యులు

ఒంగోలు సిటీ: స్థానిక జీజీహెచ్‌లో మొట్టమొదటిసారిగా గుండెకు స్టంట్ వేసి ఆపరేషన్‌ను దిగ్విజయంగా పూర్తిచేసిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావును బుధవారం పలువురు అభినందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంసీజీహెచ్ ఎంప్లాయీస్ అసోసియేషన గౌరవాధ్యక్షుడు శేషు సుధాకర్‌బాబు, గౌరవ ఉపాధ్యక్షుడు తిరుమలరావు, ప్రెసిడెంట్ దేవూరి వెంకటరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎంవీ రాజు, సెక్రటరీ బి.ప్రసాద్, ట్రెజరర్ అయ్యలబాబు, వైస్ ప్రెసిడెంట్ రామారావు, మల్లికార్జున కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రెసిడెంట్ దేవూరి వెంకట్రావు మాట్లాడుతూ ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల కార్డియాలజీ విభాగంలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడం, గుండెకు స్టంట్లు అమర్చడం చాలా సంతోషకరమని అన్నారు. జిల్లాలో పేరున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చాలా ఖర్చుతో కూడుకున్న వైద్యాన్ని ఉచితంగా చేయడం గొప్ప విషయమని, అవసరం ఉన్న పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

చీమకుర్తి రూరల్: మండలంలోని గోనుగుంట గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి 13వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 100 మంది దంపతులు పాల్గొనగా, నారాయణం రమణదీక్షితులు దిగ్విజయంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వచనాలు అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని ఎండోమెంట్ అధికారిణి రజిని పర్యవేక్షించగా, గ్రామస్తులు రాయిని రంగారావు దంపతులు, రాయిని తిరుమల దంపతులు, రాజశేఖర్ దంపతులు, భాస్కర్‌రావు దంపతులు, సర్పంచ్ సాదు వెంకటరమణమ్మ, మోహన్‌రావు దంపతులు, బదరీ నారాయణ దంపతులు, పమిడి వెంకటేశ్వర్లు దంపతులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులంతా బాధ్యతగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా బాధ్యతతో పనిచేయాలని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ జరిగే ఒంగోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గంలోని ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలం, ఒంగోలు నగరంలోని నాయకులందరూ కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలకు తానెప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఏమైనా మనస్పర్థలుంటే మనసులో పెట్టుకోకుండా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. చెప్పుడు మాటలు వినే స్వభావం తనది కాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు రాబోయే అన్నిరకాల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ నెల 25వ తేదీ జరిగే విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు హాజరవుతారని చుండూరు రవిబాబు తెలిపారు. సమావేశంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు రాజీవ్, ఆళ్ల రవీంద్రారెడ్డి, నాయకులు, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.



పాల్గొన్న నాయకులు

ఇళ్ల స్థలాల దరఖాస్తులు పరిశీలించాలి

- సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, డీఆర్ఓ

ఒంగోలు సబర్బన్: ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి బుధవారం రెవెన్యూ అంశాలు, రీ సర్వే, నివేశన స్థలాల వెరిఫికేషన్ ప్రక్రియ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంటి పట్టాల వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపడుతున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయిలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపీడీవో డి.సురేష్‌బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలు తగ్గిన వెంటనే గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామ పంచాయతీలో కొత్త పనులు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ వాసంతి, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామదూతం శిరసా నమామి



సీతారాంపురంలో విద్యుత్ దీపాలంకరణలో సీతారామాంజనేయస్వామి దేవస్థానం



విద్యుత్ దీపాలంకరణలో సుందర నగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం

- నేడు హనుమాన్ జయంతి
- రంగురంగుల విద్యుత్ దీపాలతో హనుమంతుని ఆలయాల అలంకరణ
- భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన దేవస్థాన నిర్వాహకులు, అధికారులు

ఒంగోలు మెట్రో: జిల్లా వ్యాప్తంగా శ్రీరామదూత అంజనేయస్వామి జయంతి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒంగోలు నగరంలోని ప్రముఖ కూడళ్లలో హనుమాన్ జయంతి వేడుకలకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. హనుమాన్, రామ మందిరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఒంగోలు కేశవపేటలోని వీరాంజనేయస్వామి దేవస్థానం, లాయర్‌పేట చిట్టి ఆంజనేయస్వామి మందిరం, కొప్పోలు కార్యసిద్ధి ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, మంగమూరుడొంక మర్రిచెట్టు కాలనీలోని పొలిమేర అభయాంజనేయస్వామి, మంగమూరుడొంక సుందర నగరంలోని పంచముఖ ఆంజనేయ దేవస్థానం, గద్దలగుంటలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, కమ్మపాలెం గిలకల బావి దగ్గర అభయాంజనేయస్వామి దేవస్థానం, సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం, ఒంగోలు ద్వారకానగర్ మాతాశిశు వైద్యశాల దగ్గర వీరాంజనేయస్వామి దేవస్థానం, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలకు ఆలయ నిర్వాహకులు, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని హనుమాన్ ఆలయాలలో ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలతో సామూహికంగా భక్తులచే రామనామ సంకీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పాల్గొనాలని కోరారు.



పూజలందుకుంటున్న పోలిమేర అభయాంజనేయస్వామి

బ్లాక్ బర్లీ వివరాలు త్వరగా సేకరించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి వెంకట్రావు

నాగులుప్పలపాడు: రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా బ్లాక్ బర్లీ పొగాకు సాగుచేసిన రైతుల వివరాలను వ్యవసాయశాఖ సిబ్బంది త్వరగా సేకరించాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు కేంద్ర సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రబీ 2025కుగానూ మండలం వ్యాప్తంగా గ్రామాల్లో ఎవరైతే రైతులు బ్లాక్ బర్లీ పొగాకు సాగుచేశారో సిబ్బంది స్వయంగా ఆ పంట వద్దకు వెళ్లి రైతుల వివరాలతో పాటు పొగాకు నిల్వల వివరాలను ఏపీఏఐఎంఎస్ యాప్‌లో ఫొటోతో పాటు నమోదు చేయాలని తెలిపారు. ఈ సమాచారం ఆధారంగానే రైతుల వద్ద ఉన్న బ్లాక్ బర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతుల వివరాల నమోదులో ఎలాంటి అలసత్వం లేకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు.

చుండూరు రవిబాబును కలిసిన ప్రమీల



చుండూరు రవిబాబు, కఠారి శంకరరావుకు అభినందనలు తెలుపుతున్న బత్తుల ప్రమీల, తదితరులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఒంగోలు నగర అధ్యక్షురాలు బత్తుల ప్రమీల బుధవారం ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చుండూరు రవిబాబుతో పాటు పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావును శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆమె వెంట పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకులు సాధం విజయలక్ష్మి, లక్ష్మీకాంతం, అప్సర్, రాజేశ్వరి, టి.మాధవి, పేరం ప్రసన్న, వి.వాణి, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



ఘటన స్థలంలో దెబ్బతిన్న కారు, మోటార్ సైకిల్

నాగులుప్పలపాడు: కారు ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బెల్లం ఆంజనేయులు మోటార్ సైకిల్‌పై ఉప్పుగుండూరు గ్రామంలోని సర్వీస్ రోడ్డు నుంచి 216వ నంబర్ జాతీయ రహదారిపైకి ఎక్కే క్రమంలో బాపట్ల నుంచి కావలి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్ నుజ్జునుజ్జయి దానిపై ఉన్న బెల్లం ఆంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని 108 వాహనంలో ఒంగోలులోని ఆస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొన్న కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన కారు

ఒంగోలు సిటీ: నగర శివారులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద కారు–లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. బుధవారం నెల్లూరు నుంచి వస్తున్న కారు కొప్పోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే వేగంగా వెళ్తా లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. కారులో ఆరుగురు ప్రయాణిస్తుండగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. ఈ నెల 4వ తేదీ కొప్పోలు బ్రిడ్జి మీద ఒకేసారి మూడు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. సరిగ్గా అదే ప్రదేశంలో ఈ ప్రమాదం జరగడం గమనార్హం

హెచ్ఐవీపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఒంగోలు సిటీ: స్థానిక కర్నూలు రోడ్డు బైపాస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సౌజన్యంతో జై రావు కళాబృందం వారు హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధిపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు, టీబీ వ్యాధి లక్షణాలను పాటలు, నాటికల ద్వారా తెలియజేశారు. 2017 యాక్ట్ చట్టం గురించి, 1097 టోల్ ఫ్రీ గురించి, రక్తదానం ఆవశ్యకత గురించి కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రో స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ పీరు బాషా, ఏఎస్ఎం పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

క్విస్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లకు అవార్డులు



అవార్డులు పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న క్విస్ కాలేజీ యాజమాన్యం

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ క్యాడెట్లుగా అవార్డులు అందుకున్నారు. ఒంగోలు ఆర్జేయూకేటీలో ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ – 2లో క్విస్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ క్యాంప్‌లో భాగంగా నిర్వహించిన ఆర్మీ డ్రిల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పూర్ణిమ బెస్ట్ క్యాడెట్‌గా నిలిచింది. టెంట్ పిచ్చింగ్ కాంపిటేషన్‌లో అత్యంత తక్కువ టైంలో టెంట్ వేసిన ఉపదేశ్, విజయ్, అభిషేక్, హరిశంకర్, జయంత్, కరీంబాషా, వెంకటేశ్ మొదటి బహుమతి సాధించారు. దాంతో పాటు తల్ సైనిక్ షూటింగ్, అబస్టకల్ ట్రైనింగ్‌లో ప్రతిభ కనబరిచిన వెంకటేశ్, జయంత్, హేమసాయి, విజయ్, అభిషేక్, ఉపదేశ్‌లు చీరాలలో జరగబోయే తదుపరి క్యాంప్‌నకు ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా నుంచి కేవలం క్విస్ కళాశాల విద్యార్థులు మాత్రమే నెక్స్ట్ లెవెల్ ట్రైనింగ్‌కి ఎన్నికైనట్లు ఎన్‌సీసీ చీఫ్ రమణయ్య తెలిపారు. బహుమతులు, అవార్డులు సాధించిన క్యాడెట్లు, వారికి ట్రైనింగ్ ఇచ్చిన రమణయ్య, ఎన్‌సీసీ డీన్ డాక్టర్ వాసుబాబు, శ్రీనీలాయ్‌లను క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రశాంత్, బీఎస్‌హెచ్ హెచ్‌వోడీ డాక్టర్ జి.శ్రీనివాసరావు, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక క్షేమం కోసం రుద్ర హవనం

ఒంగోలు మెట్రో: స్థానిక తాతా కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం ప్రముఖ వేద పండితుడు వేమూరు పూర్ణానందశర్మ ఆధ్వర్యంలో రుద్ర హవనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వేదిక మీద ఏర్పాటు చేసిన మండపంలో గణపతి పూజ, నవగ్రహ మండపారాధన పూజా క్రతువులు నిర్వహించారు. మండపంలో ఏర్పాటు చేసిన తొమ్మిది హోమ గుండాల్లో 50 మంది వేద పండితులు పాల్గొని ఒక్కొక్క హోమగుండంలో ఎనిమిది మంది ఋత్వికులు రుద్ర హవనం, నవగ్రహ హవనం, శ్రీ సూక్త హవనం, పురుష సూక్తం, మహా పూర్ణాహుతి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల దేశ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్తతలు సమసిపోవాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని యాగ్నిక బ్రహ్మ వేమూరి పూర్ణానందశర్మ అమెరికా నుంచి ఒంగోలు వచ్చి 50 మంది ఋత్వికులచే రుద్ర హవనం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేద పండితులు పిస్నెల్లి చంద్రశేఖర అవధాని, చివుకుల ప్రసాదశర్మ, సముద్రాల రామ్మోహన శర్మ పాల్గొన్నారు.



రుద్ర హవనంలో పాల్గొన్న ఋత్వికులు